

జలసవ్వడి.. జనసందడి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పలు జలపాతాలు సవ్వడి చేస్తున్నాయి. పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. 8లో▸



మూల నక్షత్రం పూజలు

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో ఆదివారం మూలనక్షత్ర పూజల్లో భాగంగా ఉత్సవ మూర్తికి విశేష అభిషేకం, కలశపూజ, గణపతిపూజ, సరస్వతీపూజ, కుంకుమార్చన నిర్వహించారు. అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.0 /24.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశముంది

న్యూస్‌రీల్

రఘుకు దాతల చేయూత

- 'ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు' కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్..

లక్ష్మణచాంద: 'ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు' శీర్షికన మండలంలోని పొట్టపెల్లి (కే)కు చెందిన గొంతు సంబంధిత వ్యాధిగ్రస్తుడు రఘు దీనస్థితిపై ఆదివారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి దాతలు స్పందిస్తున్నారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రఘుకు సాయం చేసేందుకు పలువురు ముందుకువచ్చారు. పొట్టపెల్లి (కే) సర్పంచ్, గ్రామస్తులతోపాటు ఇతర గ్రామాలకు చెందిన పలువురు దాతలు నేరుగా బాధితుడికి ఫోన్ పే, గూగుల్ పే ద్వారా ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు రూ.50 వేలు అందించారు. మరింతమంది దాతలు ముందుకువస్తున్నారు. దీంతో రఘు కుటుంబీకులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

బాసర ఆలయంలో బీఆర్‌ఎస్ ఎన్‌ఆర్‌ఐ బృందం పూజలు



ఆలయంలో బీఆర్‌ఎస్ ఎన్‌ఆర్‌ఐ బృందం

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారిని ఆదివారం బీఆర్‌ఎస్ ఎన్‌ఆర్‌ఐ కో ఆర్డినేటర్ మహేశ్ బిగాల ఎన్‌ఆర్‌ఐ బృందంతో కలిసి దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు తీసుకున్నారు. బీఆర్‌ఎస్ బాసర మండలాధ్యక్షుడు కోర్వ శ్యామ్ వీరిని సన్మానించారు. అలాగే తహసీల్దార్ సంతోష్, రెవెన్యూ సిబ్బంది ఆహ్వానం మేరకు ఆలయానికి వచ్చిన అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆదుకోవాలని ఐడీసీ చైర్మన్‌కు మత్స్యకారుల వినతి

భైంసారూరల్: మండలంలోని సిరాల ప్రాజెక్టుపై ఆధారపడి జీవిస్తున్న తమను ఆదుకోవాలని రామస్వామి మత్స్యకారుల సంఘం నాయకులు ఐడీసీ చైర్మన్ వేణుగోపాలాచారిని కోరారు. ఆదివారం భైంసాలోని విశ్రాంతి భవనంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సిరాల చెరువు కట్ట తెగి ఎనిమిది గ్రామాలకు చెందిన 100 మందిమి ఉపాధి కోల్పోయామని తెలిపారు. ప్రభుత్వం తరఫున పరిహాం మంజూరు చేయించి ఆదుకోవాలని కోరారు. సంఘం అధ్యక్షుడు ఆనంద్ తదితరులున్నారు.


రేవంత్‌ను కలిసిన నాయకులు



రేవంత్‌ను సన్మానిస్తున్న కిరణ్, శ్రీహరిరావు

భైంసాటౌన్: డాక్టర్ కిరణ్ ఫౌండేషన్ చైర్మన్, కుభీర్ మండలం నిగ్వా గ్రామానికి చెందిన కొమ్మేవార్ కిరణ్‌కుమార్ ఆదివారం టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో నిర్మల్‌కు చెందిన పార్టీ నేత శ్రీహరిరావుతో కలిశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డిని సన్మానించారు. ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు, ముధోల్ నియోజకవర్గ రాజకీయ పరి స్థితుల గురించి వివరించారు. కాగా, పార్టీ పటిష్టతకు కృషి చేయాలని రేవంత్ సూచించినట్లు నాయకులు తెలిపారు. కాంగ్రెస్‌లో బీసీలకు ప్రాధాన్యతనిస్తామని ప్రకటించిన నేపథ్యంలో కిరణ్‌కుమార్ రేవంత్‌ను కలవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

'కడెం'కు స్వల్ప ఇన్‌ఫ్లో



కడెం ప్రాజెక్ట్

కడెం: కడెం ప్రాజెక్ట్‌కు స్వల్ప ఇన్‌ఫ్లో వస్తోంది. ఆదివారం 4,697 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా రెండు వరద గేట్ల ద్వారా 3,242 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 (7.603 టీఎంసీలు) అడుగులు కాగా, ప్రస్తుతం 686.000 (4.487టీఎంసీలు) అడుగుల నీటిమట్టం ఉంది. వరద గేట్ల మరమ్మతులు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. కన్నాపూర్ గ్రామం వద్ద కాలువ మరమ్మతులు పూర్తి చేశాక కుడి కాలువకు నీటిని విడుదల చేయనున్నట్లు డీఈ భోజదాసు పేర్కొన్నారు.

విపత్తుల వేళ.. ఆదుకునేలా..



ఇప్పటికీ మరిచిపోలేం

ఈ చిత్రం.. ఇప్పటికీ నిర్మల్‌వాసులను కంటిమీద కునుకులేకుండా చేస్తున్న ఘటనకు సంబంధించింది. సరిగ్గా రెండేళ్ల క్రితం స్వర్ణనది నిర్మల్‌ను ముంచెత్తింది. జిల్లాకేంద్రంలోని సిద్ధాపూర్ జీఎన్ఆర్ కాలనీ పూర్తిగా నీటమునిగింది. పైఅంతస్తు కూడా మునిగేంత ప్రవాహం. అది కూడా వేకువజామునే రావడంతో పిల్లాపాపలతో కాలనీవాసులంతా అందుబాటులో ఉన్న రెండంతస్తుల భవనాలు ఎక్కారు. వాళ్ల హాహాకారాలు విని స్థానికులు, గంగపుత్రులు థర్మోకోల్ తెప్పలపై వెళ్లి ఒక్కొక్కరిని బయటకు తీసుకువచ్చారు. వారంతా బయటకు రావడానికి కనీసం 8గంటల సమయం పట్టింది. అప్పటివరకూ కాలనీవాసులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిపారు. సీఎం కేసీఆర్ నేరుగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో మాట్లాడి హైదరాబాద్ నుంచి ఎన్డీఆర్‌ఎఫ్ బృందాన్ని పంపించారు. వారు నిర్మల్ వచ్చేసరికి ఆరోజు రాత్రయ్యింది. అప్పటికే స్థానికులు కాలనీవాసులను రక్షించారు. అప్పుడే.. రెస్క్యూబోటు అందుబాటులో ఉంటే స్థానికులు, కాలనీవాసులు ప్రాణాలకు తెగించాల్సిన అవసరం ఏర్పడేది కాదు. ఇదిలా ఉండగా, సరిగ్గా ఈనెల 27న రెండేళ్ల క్రితంలాంటి ఘటనే.. అదే కాలనీకి ఎదురైంది. కానీ.. ఈసారి ముందస్తుగా కాలనీవాసులను సురక్షిత ప్రాంతానికి చేర్చారు.



జిల్లాకేంద్రంలో మాక్‌డ్రిల్ చేస్తున్న కలెక్టర్, ఎస్పీ

- మూడేళ్లుగా జిల్లాకు వరదలు
- ఫైర్, పోలీస్ సిబ్బందికి శిక్షణ
- నిర్మల్‌లో రెస్క్యూబోట్లు సిద్ధం
- ఇటీవల వరదల్లో ఉపయోగం
- జిల్లాకు అదనంగా ఎన్డీఆర్‌ఎఫ్

200మంది కార్మికులను కాపాడారు



జిల్లాకేంద్రం నుంచి సిద్ధాపూర్ మీదుగా కొట్ల(కే) వెళ్లేమార్గంలో నిర్మిస్తున్న డబుల్‌బెడ్రూం ఇళ్లల్లో ఈనెల 27న వచ్చిన వరదల్లో దాదాపు 200మంది కార్మికులు చిక్కుకుపోయారు. ఆవైపు వెళ్లే మార్గం కూడా మూసుకుపోయింది. సిద్ధాపూర్ బ్రిడ్జి పైనుంచి స్వర్ణనది ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచాయి. చివరకు అగ్నిమాపకశాఖకు సమాచారం అందగా వారు రెస్క్యూబోటు తీసుకుని ఘటనా స్థలానికి చేరారు. ఆ బోటు ద్వారా దాదాపు 200మంది కార్మికులను సురక్షిత ప్రాంతానికి తీసుకువచ్చారు. సకాలంలో బోటు ఉండడంతో వారంతా సేఫ్‌గా బయటపడ్డారు.

నిర్మల్: జిల్లాలో ఎప్పుడు భారీ వర్షాలు పడతాయో.. ఎప్పుడు వరదలు ముంచెత్తుతాయో తెలియని పరిస్థితి. రెండేళ్లుగా పరిస్థితులు విషమిస్తూనే ఉన్నాయి. మూడో ఏడాదీ వరదలు విరుచుకుపడ్డాయి. ఈనేపథ్యంలో విపత్తు నిర్వహణ సేవలనూ పెంచుతున్నారు. ప్రభుత్వ సూచనతో జిల్లాకు ఇటీవల ఎన్డీఆర్‌ఎఫ్ బృందాన్ని పంపించారు. మూడ్రోజులుగా జిల్లాకేంద్రంలో అందుబాటులో ఉంచారు. జిల్లాకూ రెండు రెస్క్యూబోట్లు కూడా ఇచ్చారు. అగ్నిమాపక, పోలీస్ శాఖలకు వేర్వేరుగా విపత్తు సమయాల్లో ఎలా స్పందించాలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

వారంక్రితం మాక్‌డ్రిల్..

జిల్లాకు వచ్చిన రెస్క్యూ బోట్లలో వరదల్లో చిక్కుకున్నవారిని ఎలా కాపాడాలో శిక్షణ ఇచ్చారు. ఇలా శిక్షణ పొందినవారు ఇటీవల జిల్లాకేంద్రంలోని బంగల్‌పేట్‌లోగల వినాయక్‌సాగర్‌లో మాక్‌డ్రిల్ నిర్వహించారు. వారంక్రితం అగ్నిమాపకశాఖ మాక్‌డ్రిల్ చేయగా, తాజాగా పోలీస్‌శాఖ చేపట్టిన మాక్‌డ్రిల్‌లో కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. స్వయంగా రెస్క్యూబోటులో కూర్చుని పనితీరును పరిశీలించారు. జిల్లాలో ఎదురవుతున్న వరదలు, విపత్తుల సమయాల్లో చాలా బాగా ఉపయోగపడతాయని వారు పేర్కొన్నారు. ఎన్డీఆర్‌ఎఫ్ లాంటి బృందాలు వచ్చేదాకా వేచిచూడకుండా కాపాడుకునే వీలుందని చెప్పారు.

జిల్లాకు మరిన్ని అవసరం

జిల్లాను కొన్నేళ్లుగా వరదలు వెంటాడుతూనే ఉన్నాయి. ఇలాంటి సందర్భాల్లో ప్రజలను కాపాడేందుకు అగ్ని, విపత్తు నిర్వహణ శాఖ, పోలీసులు అందుబాటులో ఉంటున్నా.. వారికి సరైన సౌకర్యాలు లేక ఇబ్బంది కలిగేది. ప్రస్తుతం బోట్లు, శిక్షణ ఇవ్వడం ఉపయోగకరంగా ఉంది. కానీ.. జిల్లావ్యాప్తంగా ఇలాంటి సేవలు అవసరం. అటు కడెం, ఇటు భైంసా కూడా వరదలతో ఏటా నీట మునుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో మరిన్ని రెస్క్యూ బోట్లు అందుబాటులో ఉంచాలి. అలాగే ప్రత్యేకంగా వరదల సమయంలో రక్షించేందుకు బృందాలనూ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఉంది.

అత్యవసర వేళలో..

వరదల సమయంలో చాలామంది నీటిలో చిక్కుకుపోతుంటారు. ఇలాంటి సమయాల్లో రక్షించాలంటే విపత్తు నిర్వహణ సిబ్బందికి కూడా కష్టమే అవుతుంది. ఇలాంటి సమయాల్లో రెస్క్యూబోటు చాలా ఉపయోగపడుతుంది. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో అన్నివేళలా అందుబాటులో ఉంచుతున్నాం.

– జైతురాం, అగ్నిమాపకశాఖ అధికారి

టీఆర్టీ కోసం నిరీక్షణ!



జిల్లాకేంద్రంలోని గ్రంథాలయంలో ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు (ఫైల్)

- జిల్లాలో 12వేల మంది అర్హులు
- టెట్‌తోపాటే టీఆర్టీ ప్రకటించాలని నిరుద్యోగుల డిమాండ్

జిల్లాలోని ఉపాధ్యాయ ఖాళీల వివరాలు

ఎస్జీటీలు	235
భాషాపండితులు	54
స్కూల్ అసిస్టెంట్లు	172
మొత్తం	461

నిర్మల్ ఖిల్లా: డీఈడీ, బీఈడీ శిక్షణ పూర్తిచేసుకున్న ప్రతీ అభ్యర్థి కల ఉపాధ్యాయ ఉద్యోగం. ఆ కలను సాకారం చేసుకునే దిశగా నిరంతరం శ్రమిస్తున్నారు. ఏళ్లుగా పుస్తకాలతో కుస్తీపడుతున్నారు. కానీ.. ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడం లేదు. ఎన్నికల ఏడాది నోటిఫికేషన్ వస్తుందని అభ్యర్థులు ఆశగా ఎదురుచూస్తున్నారు. 2017లో టీఆర్టీ(టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్) ద్వారా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టిన నుంచి ఇప్పటివరకు ఆరేళ్లు అవుతున్నా కొత్తగా భర్తీ ప్రక్రియ చేపట్టలేదు. అర్హులైన అభ్యర్థులు జిల్లాలో దాదాపు 12 వేలమంది నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారు. గతేడాది టెట్ నోటిఫికేషన్ వేసినా, టీఆర్టీకి మాత్రం మోక్షం లభించలేదు. ఇటీవల జరిగిన మంత్రివర్గ ఉప సంఘం కూడా మరోసారి టెట్ నిర్వహణకు ఓకే చెప్పింది. టీఆర్టీపై మాత్రం అడుగులు ముందుకు పడడంలేదు. రానున్న శాసనసభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయవచ్చన్న సంకేతాలు వెలువబడుతుండడంతో నిరుద్యోగుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి.

హైదరాబాద్‌కు వెళ్లిన అభ్యర్థులు..

జిల్లా నుంచి డీఈడీ, బీఈడీ చేసిన అభ్యర్థులంతా ఇటీవల హైదరాబాద్‌లోని పాఠశాల విద్యాశాఖ కార్యాలయానికి ధర్నా కోసం తరలివెళ్లారు. తక్షణమే టీఆర్టీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. త్వరలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై వెంటనే కసరత్తు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో టెట్‌తో పాటే టీఆర్టీ నోటిఫికేషన్ ఇవ్వాలని అభ్యర్థులు కోరుతున్నారు.

జిల్లాలో ఖాళీలు ఇలా...

జిల్లాలో మొత్తం ప్రభుత్వ, పంచాయతీరాజ్ పాఠశాలల్లో 461 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఇందులో 235 సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ పోస్టులు ఉండగా, 54 భాషా పండితులు, 172 స్కూల్ అసిస్టెంట్ ఖాళీలు ఉన్నాయి. వీటిలో ఎస్జీటీలు, భాషా పండితులు డైరెక్టర్ రిక్రూట్మెంట్ ద్వారా భర్తీ చేయనుండగా.. స్కూల్ అసిస్టెంట్ ఖాళీల్లో 70 శాతం ప్రమోషన్ల ద్వారా 30 శాతం డైరెక్టర్ రిక్రూట్మెంట్ ద్వారా భర్తీ చేయనున్నారు.

బదిలీలు, ప్రమోషన్లే అడ్డంకి

జిల్లాలో పలు పాఠశాలలో ఉపాధ్యాయుల ఖాళీల భర్తీ కోసం నిరుద్యోగులు ఎదురుచూస్తుండగా మరోవైపు బదిలీలు, ప్రమోషన్లు పూర్తయితేనే నూతన నియామకాల వ్యవహారం కొలిక్కి వచ్చే అవకాశం ఉంటుందని విద్యాశాఖవర్గాలు పేర్కొంటున్నాయి. బదిలీలు, ప్రమోషన్లకు గతంలోనే షెడ్యూల్ విడుదల చేయగా ప్రక్రియ కొనసాగుతుండగానే హైకోర్టు స్టే విధించింది. పలు దఫాలుగా వాదనలు విన్న రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం స్టేను కొనసాగిస్తూనే వస్తోంది. ఈ వ్యవహారం కొలిక్కి వస్తేనే నూతన ఉపాధ్యాయుల భర్తీకి నోటిఫికేషన్‌కు మార్గం సుగమమవుతుంది..

నోటిఫికేషన్ విడుదల చేయాలి



మూడు సంవత్సరాలుగా నేను ఉపాధ్యాయ ఉద్యోగం కోసం ప్రిపేర్ అవుతున్నాను. అయితే జిల్లాస్థాయిలో నియామకమయ్యే టీఆర్టీ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేయాలి. ఈ నోటిఫికేషన్ కోసం జిల్లాలో వేలాది మంది ఎదురుచూస్తున్నారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీతో పాఠశాలలు కూడా బలోపేతమవుతాయి.

– తుల గజేందర్, నిర్మల్

విద్యారంగాన్ని బలోపేతం చేయాలి



జిల్లాలోని ప్రభుత్వ, పంచాయతీరాజ్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను త్వరగా భర్తీ చేయాలి. ఇప్పటికే విద్యా వలంటీర్లను నియమించకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. విద్యారంగాన్ని బలోపేతం చేయాలంటే మొదట ఖాళీలను భర్తీ చేయాలి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు న్యాయం జరుగుతుంది.

– ఆరెపల్లి విజయ్‌కుమార్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ఆర్టీసీ ఆదాయానికి 'గండి'

- భారీ వర్షాలతో తగ్గిన రాబడి
- పలు రూట్లలో రోడ్లు ఛిద్రం
- అటువైపు బస్సుల రాకపోకలకు బ్రేక్
- పడిపోయిన ఆక్యుపెన్సీ రేషియో



ఆదిలాబాద్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పదిరోజుల పాటు కురిసిన వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తమైంది. వరదల తాకిడికి లోలెవెల్ వంతెనలు, రహదారులు కొట్టుకుపోయాయి. మారుమూల ప్రాంతాలకు రాకపోకలు నిలిచాయి. రవాణా వ్యవస్థ ఛిన్నాభిన్నమైంది. ఆర్టీసీ కూడా బస్సులను ఆయా గ్రామాలకు నడపలేని పరిస్థితి తలెత్తింది. పల్లెజనం కూడా రాకపోకలపై ఆసక్తి చూపకపోవడంతో ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) పడిపోయింది. ఫలితంగా రీజియన్ వ్యాప్తంగా సంస్థ ఆదాయానికి గండి పడింది.

తెగిన వంతెనలు.. నిలిచిన బస్సులు

ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున రహదారులు కోతకు గురయ్యాయి. వంతెనలు కొట్టుకుపోయాయి. దీంతో సంబంధిత రూట్లలో నడిచే పల్లె వెలుగు సర్వీసులకు బ్రేక్ పడింది. అయినా ఆర్టీసీ పలు ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సేవలందించింది. ఆదిలాబాద్ డిపో పరిధిలో తలమడుగు మండలం భరంపూర్ వద్ద రోడ్డు కొట్టుకుపోగా రుయ్యాడి మీదుగా సర్వీసును నడిపారు. అయితే పూర్తిస్థాయిలో బస్సులు నడపకపోవడం, పలు రోడ్లలో నడిచినా ప్రయాణికులు లేక ఆర్టీసీ ఆదాయంపై ప్రతికూల ప్రభావం చూపింది.

ఖాళీగా బస్టాండ్లు..

సాధారణ సమయాల్లో ప్రయాణికులతో కిటకిటలాడే ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్ బస్‌స్టేషన్లలో ప్రస్తుతం రద్దీ కనిపించడం లేదు. వరదల ప్రభావం కారణంగా ప్రయాణికుల సంఖ్య తగ్గిపోవడంతో సర్వీసుల సంఖ్య కుదిస్తున్నారు. భారీ వర్షాల కారణంగా రీజియన్ వ్యాప్తంగా పలు రూట్లలో నిలిపివేసిన సర్వీస్‌లను ఇంకా పునరుద్ధరించలేదు. దీంతో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని పెన్‌గంగ నది ఉధృతంగా ప్రవహించడంతో మహారాష్ట్ర వైపు వెళ్లే పలు బస్సు సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అలాగే భైంసా డిపో పరిధిలో మాటేగాం, నిర్మల్, నిజామాబాద్ వైపు సర్వీసులను పూర్తిగా నిలిపివేశారు.

పడిపోయిన ఓఆర్

వర్షాలు, వరదల ప్రభావంతో రీజియన్ వ్యాప్తంగా బస్సులు గడిచిన పది రోజుల్లో 12,700 కిలోమీటర్లు తక్కువగా తిరిగాయి. ఆదిలాబాద్, భైంసా, మంచిర్యాల డిపోల పరిధిలో 3వేల కిలోమీటర్ల చొప్పున తిరగలేకపోయాయి. ఆసిఫాబాద్‌లో రెండువేల కిలోమీటర్లు, నిర్మల్‌లో 1,500 కిలోమీటర్లు, ఉట్నూరులో 200 కిలోమీటర్ల మేర బస్సు సర్వీసులు తక్కువగా తిరిగాయి. అలాగే.. కిలోమీటర్‌కు వచ్చే ఆదాయం (ఈపీకే) ఆదిలాబాద్‌లో రూ.8, మంచిర్యాలలో రూ.8, ఆసిఫాబాద్ రూ.7, నిర్మల్ 6, భైంసా రూ.6, ఉట్నూర్‌లో రూ.6 మేర నష్టం వాటిల్లింది. ఇక ఓఆర్ విషయానికి వస్తే రీజియన్ వ్యాప్తంగా 10 నుంచి 13 పాయింట్లు తగ్గిపోవడం ఆదాయంపై ప్రభావం చూపింది.

ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్)

డిపో	10 రోజుల క్రితం	ప్రస్తుతం
ఆదిలాబాద్	64	52
నిర్మల్	66	56
భైంసా	65	55
ఆసిఫాబాద్	66	53
ఉట్నూర్	58	48
మంచిర్యాల	69	56

గమ్యస్థానాలకు చేర్చడానికి కృషి చేశాం



భారీ వర్షాలతో ఆర్టీసీకి ఆదాయం తగ్గిన మాట వాస్తవమే. ఏకధాటిగా కురిసిన వానలతో పలు రూట్లలో బస్సులు నిలిపివేయాల్సి వచ్చింది. దీంతో ఆదాయం తగ్గింది. పలు ప్రాంతాల్లో రహదారులు తెగినప్పటికీ ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణికుల ను గమ్యస్థానాలకు చేర్చడానికి కృషి చేశాం.

– సోలోమాన్, ఆదిలాబాద్ ఆర్‌ఎం

రీజియన్ పరిధిలో డిపోల వారీగా వారం రోజులుగా వచ్చిన ఆదాయం వివరాలు (రూ.లక్షల్లో)..

తేదీ	ఆదిలాబాద్	భైంసా	నిర్మల్	ఆసిఫాబాద్	మంచిర్యాల	ఉట్నూర్
23	13	8	18	9	20	2.50
24	20	17	26	11	25	3.60
25	20	10	24	11	22	3.20
26	21	10	22	11	22	3.50
27	16	1.50	13	11	20	2.60
28	15	2.60	15	12	24	2.70
29	16	6	18	10	20	2.40

'పరిహారం అందేలా చూస్తాం'



నందగాంలో రోడ్డును పరిశీలిస్తున్న విఠల్‌రెడ్డి

తానూరు: భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూస్తామని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి హామీ ఇచ్చారు. మండలంలోని హిప్నెల్లి, బెంబర, జౌలా(కే), ఎల్వత్, వాడవన, నంద్‌గాం గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. వరదల కారణంగా దెబ్బతిన్న రోడ్లు, పంటలను పరిశీలించారు. హిప్నెల్లి చెరువు గండి పడగా వందకు పైగా ఎకరాల్లో పంట నష్టం జరిగిందని బాధిత రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. అధికారులతో సర్వే నిర్వహించి బాధితులకు పరిహారం మంజూరు చేయిస్తానని చెప్పారు. హిప్నెల్లి చెరువుకు త్వరగా మరమ్మతులు చేపడతామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పోతారెడ్డి, సర్పంచ్ అబ్దుల్ గన్ని, మాజీ జెడ్పీటీసీ ఉత్తం బాలేరావ్, చంద్రకాంత్‌యాదవ్ తదితరులున్నారు.

ముధోల్ మండలంలో..

ముధోల్: భారీ వర్షాలకు మండలంలో దెబ్బతిన్న పంటలు, కోతకు గురైన రోడ్లను ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పరిశీలించారు. కూలిన గిరిజన పాఠశాల ప్రహరీని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. పంటనష్టాన్ని అధికారులు అంచనా వేస్తున్నారని తెలిపారు. నివేదికలను ప్రభుత్వానికి పంపనున్నట్లు పేర్కొన్నారు. బాధితులకు పరిహారం అందేలా చూస్తామని భరోసా కల్పించారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు ఖాలీద్, నాయకులు పోతన్నయాదవ్, శ్రీనివాస్‌గౌడ్, సమీఉల్లా ఖాన్, బాబన్న, విశ్వంభర్ తదితరులున్నారు.

బోల్సాను ముంపు గ్రామంగా ప్రకటించాలి

- ఐడీసీ చైర్మన్ వేణుగోపాలాచారి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి గ్రామస్తుల వినతి



మాట్లాడుతున్న వేణుగోపాలాచారి, విఠల్‌రెడ్డి

తానూరు: తమ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించి పునరావాసం కల్పించాలని బోల్సా గ్రామస్తులు ఐడీసీ చైర్మన్ వేణుగోపాలాచారి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని కోరారు. ఆదివారం గ్రామానికి వచ్చిన వారికి సమస్యలు తెలిపి పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఏటా వర్షాల కారణంగా గ్రామంలో వరదనీరు చేరి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వచ్చిన వరదతో వాగు ఉధృతంగా ప్రవహించి తమ ఇళ్లలోకి నీరుచేరి ప్రాణభయంతో పరుగులు తీశామని ఆవేదన వ్యక్తంజేశారు. వాగుకు ఇరువైపులా వందలాది ఎకరాల్లో వరదనీరు చేరి సోయా, పత్తి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని వాపోయారు. రైతువేదిక సమీపంలోని మూడెకరాల ప్రభుత్వ భూమిలో తమకు పునరావాసం కల్పించి ఆదుకోవాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ఐడీసీ చైర్మన్ వేణుగోపాలాచారి మాట్లాడారు. సీఎం కేసీఆర్ దృష్టికి సమస్య తీసుకువెళ్లి పునరావాసం కల్పిస్తామని, వరదలతో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చూస్తామని హామీ ఇచారు. అనంతరం గ్రామంలో కలియతిరిగి వర్షాల కారణంగా దెబ్బతిన్న ఇళ్లు పరిశీలించారు. వారి వెంట మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పోతారెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఉత్తం బాలేరావ్, నాయకులు లక్ష్మణ్, ఆయా గ్రామాల సర్పంచులున్నారు.

గజ్జలమ్మ దేవికి పూజలు

కుంటాల: మండల కేంద్రంలోని గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మీ ఆలయాల్లో గురుస్వామి గజేందర్, అర్చకుడు నరేశ్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవార్లకు మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మణ్, సుధాకర్, శంకర్, శివ తదితరులున్నారు.

జలసవ్వడి.. జనసందడి

- జలపాతాలకు సందర్శకుల తాకిడి
- సెలవు రోజు కావడంతో భారీగా తరలివచ్చిన పర్యాటకులు

ర్యాలీ గ్రామంలో..

- ఇటీవల వెలుగులోకి వచ్చిన వైనం
- 'సాక్షి' పత్రిక, సోషల్ మీడియాలో వైరల్
- జలపాతానికి పోటెత్తుతున్న పర్యాటకులు
- పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలంటూ డిమాండ్



ర్యాలీ గ్రామ శివారులోని జలపాతం వద్ద సందర్శకుల సందడి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల జిల్లా కేంద్రానికి దాదాపు 20 కిలో మీటర్ల దూరంలోని ర్యాలీ గిరిజన గ్రామ శివారులోని ఓ జలపాతం ఇటీవల వెలుగులోకి వచ్చింది. మూడేళ్ల కిందట స్థానికులు గుర్తించినా పెద్దగా వెలుగులోకి రాకుండా ఉండిపోయింది. గత వారం 'సాక్షి' దినపత్రికలో దీనిపై కథనం ప్రచురితమైంది. ఇంకేముంది పర్యాటకులు వందల సంఖ్యలో జలాపాతాన్ని సందర్శిస్తూ తన్మయత్వం పొందుతున్నారు.



జలపాతం వద్ద సందర్శకుల జోష్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రకృతి అందాలకు కొదువలేదు. అందులో భాగంగానే ఇటీవల కురుస్తున్న వర్షాలకు జలపాతాలకు వరద తాకిడి పెరిగింది. దీంతో జలసౌందర్యం వీక్షించేందుకు పర్యాటకులు భారీగా తరలివస్తున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో పలువురు కుటుంబ సమేతంగా జలపాతాలను సందర్శించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పచ్చని ప్రకృతి.. పరవళ్లు తొక్కుతున్న జలపాతాల వద్ద ఆనందంగా గడిపారు. అయితే జలపాతాల వద్ద పర్యాటకుల సందడి పెరుగుతున్నప్పటికీ సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదని, కనీస వసతులు కల్పించాలంటున్న సందర్శకుల మాటల్లోనే..



కుంటాల జలపాతం అందాలను తిలకిస్తున్న పర్యాటకులు


సౌకర్యాలు కల్పించాలి



చింతలమాదర జలపాతం వద్ద ఫొటో దిగుతున్న పర్యాటకులు



చింతల మాదర జలపాతానికి యేటా వస్తుంటాం.. అక్కడి నిర్వాహకులు సందర్శకుల నుంచి ఎంట్రీ ఫీజు తీసుకుంటున్నారు. కానీ ఎలాంటి సదుపాయాలు కల్పించడం లేదు. ఫ్యామిలీతో వచ్చినప్పుడు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. జలపాత సమీపంలో మహిళలు బట్టలు మార్చుకునేందుకు గదులను ఏర్పాటు చేయాలి.
– పోదుపుగంటి సాయి, ఆసిఫాబాద్



గుండాల జలపాతం

జలధారల వరకు వెళ్లనిస్తే బాగుండేది..



హైదరాబాద్ నుంచి వచ్చిన పర్యాటకులు

నేరడిగొండ: కుంటాల జలపాతం గురించి నిర్మల్ జిల్లాకు చెందిన స్నేహితుల ద్వారా తెలుసుకున్నాం. ఇక్కడి అందాలను తిలకించేందుకు హైదరాబాద్ నుంచి వచ్చాం. జలపాతం జలధారలను దూరం నుంచే చూసేలా అధికారులు చర్యలు చేపట్టారు. దగ్గరుకు వెళ్లనిస్తే బాగుండేది.

రోప్‌వే నిర్మిస్తే బాగుంటుంది..



మహేందర్ సింగ్ కుటుంబ సభ్యులు, నిర్మల్

నేరడిగొండ: కుంటాల జలపాతం తిలకించేందుకు రోప్‌వే నిర్మిస్తే బాగుంటుంది. దూర ప్రాంతాల నుంచి వచ్చేవారు మెట్లు దిగి, ఎక్కాలంటే అవస్థలు పడాల్సి వస్తుంది.రోప్‌వే నిర్మిస్తే పైనుంచే జలపాతం అందాలను వీక్షించేందుకు అవకాశం ఉంటుంది.

అక్కడ అలా.. ఇక్కడ ఇలా



సహస్రకుండ్ జలపాతం వద్ద నిర్మించిన రోప్‌వే

నేరడిగొండ: మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా పరిధిలో గల ఇస్లాపూర్‌లోని సహస్రకుండ్(సాసర్‌కుండ్) జలపాతం వద్ద పర్యాటకుల తాకిడి పెరిగింది. వారిని దృష్టిలో పెట్టుకుని అక్కడి ప్రభుత్వం రక్షణ చర్యలు చేపట్టింది. ఈ జలపాతం నిర్మల్ జిల్లా నుంచి 50 కి.మీ దూరంలో ఉంది. కిన్వట్, బోథ్ తాలుకాలు పక్కపక్కనే ఉంటాయి. మన కుంటాల జలపాతం వద్ద తెలంగాణ ప్రభుత్వం రక్షణ చర్యలు చేపట్టలేదు. గతంలో జరిగిన ప్రమాదాల్లో అనేక మంది చనిపోయినా అధికార యంత్రాంగం పాఠాలు నేర్వలేదు. కాగా, కుంటాల జలపాతం అభివృద్ధికి రూ.3 కోట్లకు పైగా నిధులు మంజూరైనట్లు టూరిజం శాఖ జిల్లా అధికారి రవికుమార్ తెలిపారు.



కుంటాల జలపాతం వద్ద రక్షణ లేని ప్రదేశంలో పర్యాటకులు

జలపాతం బాగుంది..



వర్షం నీటితో పాటు సహజసిద్ధంగా ఈ జలపాతం ఉండడంతో చాలా బాగుంది. 'సాక్షి', సోషల్ మీడియాలో చూసి జలపాతాన్ని చూసేందుకు కుటుంబ సభ్యులతో వచ్చాం. ఇక్కడికి వచ్చాక జలపాతాన్ని చూసి ఎంజాయ్ చేశాం.
– నిఖిత, సందర్శకురాలు, మంచిర్యాల

జలపాతం అందాలు మైమరిపిస్తున్నాయి



ఓర్స సవిత చంద్రశేఖర్ యాదవ్, కుమారి ఎంపీటీసీ

కుంటాల జలపాతం అందాలు మైమరిపిస్తున్నాయి. మెట్ల ద్వారా కిందకు దిగేటప్పుడు అవస్థలు ఎదురవుతున్నాయి. మెట్లు దెబ్బతిన్నాయి. జలపాతం కింది భాగంలో మహిళల కోసం ప్రత్యేకంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేయాలి.

పర్యాటక కేంద్రంగా గుర్తించాలి



మందమర్రిరూరల్: మంచిర్యాల జిల్లా కేంద్రానికి పది కిలో మీటర్ల దూరంలోని మందమర్రి మండలంలోని అందుగులపేట గ్రామానికి ఐదారు కిలో మీటర్ల దూరంలో క్షీర జలపాతం ఉండడంతో పర్యాటకుల తాకిడి ఎక్కువైంది. ప్రభుత్వం ఈ జలపాతాన్ని పర్యాటక కేంద్రంగా గుర్తించి సందర్శకుల సౌకర్యం కోసం అన్ని ఏర్పాట్లు చేయాలి. అలాగే జలపాతం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా హెచ్చరిక బోర్డులతో పాటు తగు చర్యలు తీసుకోవాలి.
– కొండపర్తి సందీప్, అందుగులపేట గ్రామస్తుడు

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



అందుగులపేట సమీపంలో..



మందమర్రిరూరల్: అందుగులపేట గ్రామ పంచాయతీ పరిధిలో జలపాతం ఉందని మిత్రులు చెప్పడంతో చూడడానికి వచ్చాం. అందుగులపేట గ్రామం నుంచి దారి ఉందని వెళ్లితే రాళ్లవాగుపై ఉన్న వంతెన కూలిపోవడంతో మళ్లీ సుమారు ఎనిమిది కిలో మీటర్లు వెనక్కి వచ్చి బొక్కలగుట్ట గ్రామంలోని రోడ్డు గుండా క్షీర జలపాతం చేరుకున్నాం.
– పొన్నాల రాజు, మంచిర్యాల

దగ్గరలోనే జలపాతం..



అటవీ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీరు పాల నురుగులా కొండపై నుంచి జాలువారుతూ చూడముచ్చటగా ఉన్న అందమైన ఈ జలపాతం మంచిర్యాలకు దగ్గరలోనే ఉంది. ఇన్నాళ్లు ఎవరికీ తెలియకుండా ఇప్పుడు దీనికి ప్రాచుర్యం లభిస్తోంది.
– దేవులపల్లి శ్రావ్య, సందర్శకురాలు, మంచిర్యాల

మాలో జోష్ పెంచింది..



విశేషంగా ఉన్న ఈ జలపాతం సందర్శించడమే కాదు జలపాతం నీటిలో తడుస్తూ చేసిన ఎంజాయ్ మాలో చాలా జోష్ పెంచింది. జలపాతం గురించి తెలియగానే వెంటనే వచ్చేశాం. జలపాతం అందాలు మమ్మల్ని కట్టిపడేశాయి.
– మహ్మద్‌అలీ, సందర్శకుడు, మంచిర్యాల

అభివృద్ధి చేయాలి



ఈ జలపాతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలి. మూడేళ్ల కిందట యువకులు షార్ట్ ఫిల్మ్ తీయడంతో తెలిసింది. ఇటీవల 'సాక్షి' దినపత్రికతో పాటు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో పర్యాటకుల సంఖ్య పెరిగింది.
– కనగర్తి మురళీధర్, ర్యాలీ గ్రామస్తుడు

కాలినడకన వెళ్లాం..



గుండాల జలపాతం చూసేందుకు రోంపెల్లి గ్రామం నుంచి దాదాపు ఆరు కిలో మీటర్ల మేర నడుచుకుంటూ వెళ్లాం. ఇంత అందమైనా జలపాతం ఉన్న కనీస రోడ్డు సౌకర్యం లేకపోవడం దురదృష్టకరం.. కనీస వసతులు కల్పిస్తే అభివృద్ధి చెందుతుంది.
– ఒరగంటి రవీందర్, గోలేటి (రెబ్బెన)

చాలా బాగుంది..



చింతలమాదర జలపాతం ఎంతో బాగుంది. పైనుంచి పాల మాదిరిగా నీళ్లు కిందికి జారుతుండటం పర్యాటకులను ఎంతో కనువిందు చేస్తుంది. కానీ జలపాతం వద్ద కనీసం మంచినీటి సౌకర్యం అయినా అధికారులు కల్పిస్తే బాగుటుంది.
– తిరుపతి, సుంగాపూర్(తిర్యాణి)

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. 88854 86421. [M-1221471]

■ అర్జెంటుగా మూతపడ్డ కంపెనీకి వాచ్‌మెన్, సూపర్‌వైజర్ కావలెను సిర్పూర్ పేపర్ మిల్ ప్రక్కన సర్ సిల్క్ కంపెనీ కాగజ్‌నగర్, ఉచిత గృహ వసతి (కుటుంబంతో ఉండవలెను) సంప్రదించండి : 7569783139, 9440050036, 9494441627 [H-788792]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా ప్రజ్ఞకుమార్



ఆదిలాబాద్‌రూరల్: భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా రత్నజాడే ప్రజ్ఞకుమార్ నియమాకమయ్యారు. మహాసభ రాష్ట్ర ఉత్తర విభాగం నూతన కార్యవర్గాన్ని హైదరాబాద్‌లో శనివారం ఎన్నుకున్నారు. జాతీయకమిటీ నేతలు ప్రవీణ్ నికాడే, ఎస్‌కె బండారే, డీఎం కాంబ్లే, సంజయ్ బోధి ఆధ్వర్యంలో రాష్ట్రకార్యదర్శిగా ప్రజ్ఞాకుమార్‌ను నియమించారు. సెప్టెంబర్ 30లోగా గ్రామ, మండల, డివిజన్, జిల్లా కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారని ప్రజ్ఞకుమార్ తెలిపారు.

ఉరేసుకుని రైతు ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: గత కొన్నేళ్లుగా పంటలు సాగు చేస్తున్న భూమి తనకు దక్కుతుందో లేదోనని మనస్తాపంతో రైతు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హెడ్‌కానిస్టేబుల్ గోవింద్ కథనం ప్రకారం.. ఆదిలాబాద్ రూరల్ మండలం పొచ్చర గ్రామానికి చెందిన రైతు ఎల్టీ నర్సారెడ్డి (48)కి భార్య లావణ్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయనకు పొచ్చర శివారు ప్రాంత్రంలో మూడెకరాలు ఉంది. భీంసరి శివారులో మరో నాలుగెకరాల వ్యవసాయ భూమి ఉండగా, ఇందులో ఒక ఎకరం భూమి జాతీయ రహదారి 44 నిర్మాణంలో పోతుంది. మూడెకరాలు పంట సాగు చేస్తున్నాడు. నర్సారెడ్డికి తెలియకుండానే గుడిహత్నూర్ మండలం సీతగొంది గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పట్టా చేసుకున్నాడు. ఈ విషయం తెలియడంతో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టాడు. ఆ భూమి తనదేనని సదరు వ్యక్తి పేర్కొనడంతో నర్సారెడ్డి మనస్తాపం చెందాడు. ఆ మూడెకరాల భూమి పట్టా కాకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. శనివారం రాత్రి మద్యం మత్తులో పీరీలను చూడడానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పాడు. అర్ధరాత్రి 1 గంట వరకు ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు రాత్రి వెతికినా దొరకలేదు. పొచ్చర శివారు ప్రాంతంలో నర్సారెడ్డి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఆయన సోదరుడు పురుషోత్తంరెడ్డి ఆదివారం గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

పురుగుల మందు తాగి బాలుడు..

లోకేశ్వరం: పురుగుల మందు తాగి బాలుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని రాజూర గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై సాయికుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గోస్కుల నందు (16) పుట్టినప్పటి నుంచి శారీరక ఎదుగుదల లోపం, పిట్స్ కారణంగా మతిస్థిమితం సరిగ్గా లేదు. ఆదివారం ఉదయం తల్లి రాధిక వ్యవసాయ కూలీ పనులకు వెళ్లింది. ఆమె వెంట నందు వెళ్లి అక్కడ ఉన్న గుర్తు తెలియని పురుగుల మందు తాగి కింద పడిపోయాడు. నందును అంబులెన్స్‌లో నిర్మల్ ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యలో మృతిచెందాడు. తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

కడెం: నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం బీబీపూర్‌తండా హైవే పై జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. కడెం మండల కేంద్రానికి చెందిన ఫరీద్ (33) ఇటీవల హైదరాబాద్‌లోని బంధువుల వద్దకు వెళ్లాడు. ఆదివారం ఉదయం బైక్‌పై కడెం వస్తున్నాడు. మార్గమధ్యలో బీబీపూర్‌తండా వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

సీఆర్‌ఆర్ మృతి తీరనిలోటు

- రాష్ట్రమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



సీఆర్‌ఆర్‌కు నివాళులర్పిస్తున్న మాణిక్‌రావు ఠాక్రే

ఆదిలాబాద్‌రూరల్: మాజీ మంత్రి చిల్కూరి రామచంద్రారెడ్డి(సీఆర్‌ఆర్) మృతి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు తీరని లోటని రాష్ట్రమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మావల మండల కేంద్రంలో చిల్కూరి లక్ష్మీ గార్డెన్‌లో ఆదివారం రామచంద్రారెడ్డి సంతాప సభ ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులుగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ ఆదిలాబాద్ ఎవరెంటే సీఆర్‌ఆర్ పేరు గుర్తుకు వచ్చేదన్నారు. ప్రజలకు ఎప్పుడు సేవ చేయాలని తపించే వ్యక్తి సీఆర్‌ఆర్ అని పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు అండగా ఉంటారన్నారు. విద్యార్థి దశలో ఉన్న సమయంలో తాను చదువుకుంటున్న పాఠశాలకు సీఆర్‌ఆర్ వచ్చారని ఎమ్మెల్యే జోగు రామన్న గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డిభోజారెడ్డి, ఎమ్మెల్యేలు రాథోడ్ బాపూరావు, నడిపెల్లి దివాకర్ రావు, మాజీ ఎంపీ గోడం నగేశ్, రాష్ట్ర మాజీ డెయిరీ చైర్మన్ లోక భూమారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రంగినేని మనీష పవన్ రావు ఉన్నారు.

'రాంచంద్రారెడ్డి మిత్రుడే'

రాంచంద్రారెడ్డి తనకు మిత్రుడని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే అన్నారు. అందరి సంక్షేమాన్ని కోరే వ్యక్తి సీఆర్‌ఆర్ అని కొనియాడారు. పార్టీ పరంగా ఆయన కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐసీసీ సెక్రెటరీ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి, కర్ణాటక ఎమ్మెల్యే విశ్వనాథ్, డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు సుజాత, వెడ్మ బొజ్జు, మాజీ డీసీసీ అధ్యక్షుడు భార్గవ్ దేశ్‌పాండే, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, జెడ్పీటీసీలు గణేశ్‌రెడ్డి, నర్సయ్య, చారులత రాథోడ్, పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసిని రెడ్డి పాల్గొన్నారు.

'కోర్టా-చనాఖా' పూర్తికాకనే పంటలకు నష్టం

- ఎంపీ సోయం బాపూరావు



నష్టపోయిన పంట పరిశీలిస్తున్న ఎంపీ

తాంసి: రాష్ట్ర ప్రభుత్వం పెన్‌గంగ నదిపై నిర్మిస్తున్న కోర్టా చనాఖా ప్రాజెక్టు పూర్తి చేయకపోవడంతో వరదలకు రైతులు పంటలను నష్టపోవాల్సి వస్తోందని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు అన్నారు. భీంపూర్ మండలం అర్లి(టి) శివారులో భారీ వర్షాలకు పెన్‌గంగ నది బ్యాక్‌వాటర్‌తో ముంపునకు గురైన పంటచేలను బీజేపీ నాయకులతో కలిసి ఆదివారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వం నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.20వేల పరిహారం అందించాలన్నారు. ఇప్పటికే విపత్తుల సమయంలో కేంద్రం కేటాయించినా రూ.320 కోట్ల నిధులను ప్రభుత్వం దారి మళ్లిస్తుందన్నారు. జిల్లాలో పంట నష్టం అంచనా వేయడానికి మరో రెండు రోజుల్లో కేంద్రం బృందం రానున్నట్లు తెలి పారు. రైల్వే బోర్డ్ మెంబర్ జి.వి.రమణ, పార్టీ మండల అధ్యక్షుడు రాకేశ్, గుడిహత్నూర్ పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్, నాయకులు జాదవ్ బలిరాం, దేవారెడ్డి, స్వామి, సాయితేజ, మండల ప్రధాన కార్యదర్శి అశోక్, ఎంపీటీసీ రెడ్డి రమేశ్, శంకర్ ఉన్నారు.